నమ్మలేని నిజాలు

నాల్గుపాదాలు
ధర్మం దారిమళ్లింది
అంధ విశ్వాసం

బొగ్గు పులుసు
జీవకోటికి ముప్పు
చెట్లను పెంచు.

మునగ బెండు
డబ్బునేతకు పండు
గెలుపు బావి.

జెండాకు జైజై
స్వరాజ్య సుపాలన
నవ్వకు సుమీ

గుండెల్లో తూట
పలికిందొక మాట
విముక్తి బాట

- రేడియమ్
సెల్: 9291527757





# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



ఒక్కసారి ఇకడ చూడు
అధినాయక గణపయ్యా
దిగజారిపోయె రాజ్యం
చెవులొగ్గి వినవయ్యా!

చిట్టచివరి జనంమాట
వింటారో ఎవరి గోడు !
రాజకీయ పాలకులకు
ఎవరి వశమో మునుగోడు !

శ్రీనిజాలు

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245





హైదరాబాద్ | బుధవారం 31-8-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 25 | పేజీలు:6 | వెల: రూ.1/-


## మట్టి గణపతులను పూజిద్దాం

-పర్యావరణాన్ని కపాడుదాం
-సెల్ఫోన్ సంస్థల అధినేత
-ఆల్ఫోర్స్ సంస్థలఅధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి
-అల్ఫోర్స్ లో అట్టహాసంగ మట్టి గణపతి అవగాహన సదస్సు



కరీంనగర్ , ఆగష్టు 30: (నేటినిజం ప్రతినిధి): మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్నికాపాడుకుందామని అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ రవీందర్ రెడ్డి అన్నారు స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్నెక్స్ వేడుకగా వేద మంత్రాల మధ్య ఏర్పాటు చేసినటువంటి మట్టి గణపతే మహా గణపతి అలాగే వినాయక చవితి విశిష్ఠత అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమాన్ని కి ముఖ్య అతిథిగా కరీంనగర్ ఆల్ఫోర్స్ సంస్థ అధినేత డాక్టర్ నరేందర్రెడ్డి హాజరయ్యారు . ప్రారంభానికి ముందు వారు ప్రాంగనములో విశేష పూలతో అలంకరించినటువంటి మట్టి గణపతికి పూజా కైంకర్యాలను నిర్వహించి నారు ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతు ప్రజలందరు పర్యావరణ హితంగా మెదలాలని మరియు పర్యావరణ పరిరక్షణే ప్రధాన విధిగా భావించి ముందుకు సాగాలని కోరారు . ఉత్సవాలు అనగానే చాలా మంది ప్రణాళిక లేకుండా వ్యేయం చేస్తారని దానిని విస్మరించి ఆధాయ వనరులను పెంపొదించుకునే దిశగా పయనించాలని వారు చెప్పారు . మట్టి విగ్రహాలను పూజించడం వలన ముల్లోకాల్లో పూజలు చేసినంత ఫలితం వస్తుందని పలు పురాణాల్లో స్పష్టంగా లిఖించబడినదని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరు ఉత్సవాలలో మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షకులుగా ఉండాలని పిలుపునిచ్చారు . నేడు చాలా మందికి అవగాహన లేకపోవటం వలన ఇష్టానుసారంగా ప్రతిమలను ప్రతిష్టిస్తున్నారని గుర్తు చేస్తు ప్రతిష్టించటం చాలా మంచి సూచీక కాని వారు పర్యావరణ ప్రేమికులుగా మట్టితో చేసినవి ప్రతిష్టించాలని సూచించారు . తద్వారా సమాజాన్ని కాలుష్య కొర నుండి కాపాడావచ్చని అభిప్రాయపడ్డారు . ప్రభుత్వం వారు నిర్వహకులకు పారీతోషికాలను ప్రకటించాలని మరియు రాయితీలు ఇవ్వాలని కోరారు . నిర్వాహకులు అందరు తప్పనిసరీగా పర్యావరణ పరిరక్షణ నియమాలను పాటించాలని మరియు మనవాళికి రక్షణకవచంగా ఉండాలని కోరారు . సమాజానికి చేయుతనివ్వాటానికై మరియు నిర్వాహకుల్లో ఉత్సహం నింపటానికై పాఠశాలలో మట్టి గణపతి ఉత్సవాన్ని నిర్వహించామని తెలిపారు . ప్రతి ఒక్కరు మట్టి గణపతిని పూజించాలని మరియు ప్రకృతి మిత్రునిగా వ్యవహరించాలని చెప్పారు . వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి మాగణపతి మట్టి గణపతి మరి మీది , మట్టి గణపతి శుభఫలాలకు అధిపతి నృత్యాలు చాలా ఆకర్షింపచేశాయి . సదస్సులో భాగంగా విద్యార్థులచేత మట్టిగణపతి కి జై , మట్టి గణపతి ని పూజీద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం మట్టి గణపతియే మహాగణపతి అని నినాదాలు చేపించి చక్కటి అవగాహన కల్పించారు . వేడుకలను మరింత ఉత్సాహపరిచే విధంగా సుమారు 150 మంది విద్యార్థులు వివిధ దేవతామూర్తుల రుపాల్లో విచ్చేసి భక్తి వాతావరణాన్ని రెట్టింపు చేశారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు , తల్లితండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు .






## ఉపాధి హామీని నిలిపివేసేందుకు కేంద్రం కుట్ర : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, ఆగష్టు 30: ఉపాధి హామీ అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్గా నిలిచింది. రాష్ట్రంలో ఆ పథకాన్ని నిలిపేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందని, అందుకే రకరకాల తనిఖీలతో వేధించే ప్రయత్నం చేస్తున్నదని పంచాయతీరాజ్ శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో లాగా తెలంగాణలో చేద్దామంటే కుదరదని, ఇక్కడి ప్రజలు తిరగడతారని మంత్రి హెచ్చరించారు. బోయినపల్లిలోని మల్లా రెడ్డి ఫంక్షన్ హాలులో రాష్ట్ర ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం, టీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్వర్యంలో జరిగిన రాష్ట్ర వ్యాప్త ఫీల్డ్ అసిస్టెంట్ల కృతజ్ఞత సభను జ్యోతి వెలిగించి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనేక రకాల సమస్యలు సృష్టించి మొత్తం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో 2014 నుంచి 2018 వరకు కేవలం 3 టీంలను పంపిస్తే ఈ ఏడాది ఇప్పటికే 3 టీంలు ఒకసారి, 15 టీంలు ఒకసారి మొత్తం 18 టీంలను పంపించి లేని తప్పులను ఎత్తి చూపి, పేదల నోట్లో మట్టి కొట్టాలని చూస్తున్నారని మంత్రి విమర్శించారు.

హరిత హారం వల్ల 7.5శాతం పచ్చదనం పెరిగిందని, కేంద్ర ప్రభుత్వ సంస్థలే చెబుతున్నాయి. పేద కూలీల కోసం ఏ సౌకర్యం కల్పించాలన్నా కేంద్రం అడ్డు పడుతున్నదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.



### ఫీల్డ్ అసిస్టెంట్లకు అండగా ప్రభుత్వం..

మరోవైపు గతంలో కొందరి స్వార్థానికి ఫీల్డ్ అసిస్టెంట్లు బలయ్యారు. సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో ఫీల్డ్ అసిస్టెంట్లకు మళ్లీ మంచి అవకాశం వచ్చింది. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి హామీనిచ్చారు.

కార్యక్రమంలో మంత్రి మల్లా రెడ్డి, టీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబు, పార్టీ కార్యదర్శి రూప్ సింగ్, మర్రి రాజ శేఖర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నేతలు మేకల రవి, కంకల సిద్ధిరాజ్, దయామణి పాల్గొన్నారు.

## తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమే : స్పీకర్ పోచారం

కామారెడ్డి, ఆగష్టు 30: (నేటినిజం ప్రతినిధి): క్యాన్సర్ వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమేనని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ మాతా-శిశు దవాఖానలో హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒకరోజు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఆయన ప్రారంభించారు.

ఈసందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ.. యశోద హాస్పిటల్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు చేయడం అభినందనీయంమన్నారు. గతంలో క్యాన్సర్ వ్యాధి సోకితే నయం చేయడం కష్టంగా ఉండేదన్నారు. మారిన ఆధునిక పరిస్థితులలో నేడు చాలా మందికి క్యాన్సర్ మహమ్మారి బారిన పడుతున్నారు.

క్యాన్సర్ వ్యాధిని తొలిదశలోనే గుర్తించినట్లయితే నివారణ సాధ్యమేనని ఆయన తెలిపారు. రసాయన ఎరువులతో పండించిన ఆహారం తీసుకుంటే క్యాన్సర్ పెరుగుతుంది.

సహజమైన ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజా గౌడ్, బాన్సువాడ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. శ్రీనివాస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు : మంత్రి తలసాని

హైదరాబాద్, ఆగష్టు 30: గణేష్ ఉత్సవాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరు

మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. అందుకోసం అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఆరు లక్షల మట్టి విగ్రహాల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకునేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల నిర్వహకులు కూడా అధికారులకు సహకరించాలని మంత్రి కోరారు.

పాఠకులకు, ప్రకటనకర్తలకు
వినాయక చవితి శుభాకాంక్షలు






## వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆగష్టు 30: వినాయక చవితి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సకల శాస్త్రాలకు అధిపతిగా, బుద్ధికి, జ్ఞానానికి ఆరాధ్యుడిగా, ఆటంకాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా, భక్తి శ్రద్ధలతో హిందువులు గణనాథున్ని ఆరాధిస్తారని సీఎం కేసీఆర్ అన్నారు. జ్ఞానం, లక్ష్య సాధన, నైతిక విలువలు, ప్రకృతి పరిరక్షణ వంటి సుగుణాలను వినాయక చవితి పండుగ మనకు నేర్పుతుందని కేసీఆర్ పేర్కొన్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరిసేలా, ఆనందంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా వాటిని వినాయకుని దీవెనలతో అధిగమిస్తూ, సకల జన సంక్షేమమే లక్ష్యంగా, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని సీఎం స్పష్టం చేశారు. తలపెట్టిన కార్యాలు నిర్విఘ్నంగా కొనసాగేలా, సుఖ శాంతులతో జీవించేలా, దేశ ప్రజలందరికీ ఆ ఏకదంతుని దీవెనలు అందాలని సీఎం కేసీఆర్ ప్రార్థించారు.

## పర్యావరణాన్ని పరిరక్షణ అందరి బాధ్యత

-కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీ సన్నిధి వెంకటకృష్ణ



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30: (నేటినిజం ప్రతినిధి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత కావున వినాయక చవితి సందర్భంగా అందరూ మట్టి గణపతి ల ప్రతి మల తొ నే పూజించి పర్యావరణాన్ని పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని వేములవాడ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీ సన్నిధి వెంకటకృష్ణఅన్నారు .మంగళవారం వినాయకచవితి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని పర్యావరణానుకూల వినాయకమూర్తుల తయారీపై రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీసన్నిధి వెంకట కృష్ణ ప్రిన్సిపల్ కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటానికి మట్టి గణపతిని పూజించాలి వాతావరణ కాలుష్యం కాకుండా కాపాడుకునే బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు విద్యార్థులు చూడముచ్చటగా తయారుచేసిన విగ్రహమూర్తులను చూచి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్చార్జ్ అనిల్ , ఉపాధ్యాయుల బృందం , విద్యార్థులు పాల్గొన్నారు

## తాండూరు రూపురేఖలు మారుస్తాం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



వికారాబాద్, ఆగష్టు 30: అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతూ తాండూరు రూపురేఖలు మారుస్తామని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు.

తాండూరులో కొత్త పెన్షన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో ఎన్నో త్యాగాలు చేసి వృద్ధులు పిల్లలకు భారం కావొద్దని ఆలోచిస్తూ ఉంటారు.

వారికి ఆసరాగా వృద్ధాప్య పెన్షన్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అందరికి ఆసరా పింఛన్లు అందిస్తూ సీఎం కేసీఆర్ ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా మారాడన్నారు. రాష్ట్రంలో46 లక్షల మందికి వివిధ కేటగిరీల పెన్షన్లు అందిస్తున్నాం.

మధ్యవర్తుల ప్రమేయం, అవినీతికి ఆస్కారం లేకుండా ఎమ్మెల్యేల చేతుల మీదుగా పెన్షన్ల పంపిణీ చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్నామన్నారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు,మిషన్ భగీరథ వంటి పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్నాయా అని ప్రశ్నించారు.

అందరి సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్కు మీ దీవెనలు ఉండాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సోమన్నకు"ఆంధ్ర కేసరి సేవారత్న" అవార్డు ప్రదానం "గుణింత గేయాలు" పుస్తకావిష్కరణ



పెద్దకడబూరు మండల పరిధిలోని హెచ్.మురవణి ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్నను 'ఆంధ్ర కేసరి సేవారత్న' అవార్డు వరించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకోవడమే కాకుండా అచిర కాలంలోనే దాదాపు 22 పైగా పుస్తకాలు వ్రాసి,ముద్రించి తన ప్రతిభను చాటుకున్నారు.గణితో పాధ్యాయుడైనా తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా బాలసాహిత్యంలో గద్వాల సోమన్న విశేష కృషి చేసినందులకుగాను వీరి ప్రతిభను గుర్తించి ,"ఆంధ్ర కేసరి"టంగుటూరు ప్రకాశం పంతులు, మన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి జయంతిని పురస్కరించుకుని "అంతర్జాతీయ గుర్తింపు పొందిన సంస్థ,ఆదరణ వెల్ఫేర్ సొసైటీ"" మార్కాపురం వారిచే,ఈ సంస్థ చైర్మన్ శ్రీ గొట్టెముక్కల చెన్నకేశవులు మరియు ఉభయ రాష్ట్రాల యం.బి.సి గౌరవ అధ్యక్షులు డా. ఆకుమళ్ళ నాని గారులు ఈ అవార్డు ను అందజేశారు. అనంతరం గద్వాల సోమన్న రచించిన"గుణింత గేయాలు" 21వ, పుస్తకాన్ని ఆవిష్కరించారు.అవార్డు గ్రహీత గద్వాల సోమన్నను తోటి ఉపాధ్యాయులు ,శ్రేయోభిలాషులు మరియు విద్యార్థులు అభినందించారు.

## చిన్నారులకు సేవ చేయాలనే సంకల్పమే విజయానికి తొలిమెట్టు : పోలీస్ కమిషనర్



ఖమ్మం, ఆగష్టు 24: (నేటినిజం ప్రతినిధి): సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ12 వార్షికోత్సవ కార్యక్రమం నగరంలోని కోణార్క్ హోటల్ లో ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్యతిధిగా పాల్గొన్న పోలీస్ కమిషనర్ ముందుగా కేక్ కట్ చేసి చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... సామాజిక ధృక్పధంతో అందించే ప్రతి రక్తపు బొట్టు జన్యుపరమైన లోపంతో బాధపడుతున్న వ్యాదిగ్రస్తుల జీవితాన్ని నిలబెడుతుందన్నారు.

ఇలాంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రాణాపాయస్థితిలో వున్న బాధితులకు రక్తం ఇచ్చి ప్రాణం కాపాడడమంటే... అంతకన్నా పరోపకారం ఏముంటుందని అన్నారు. సమయానికి రక్తం అందక ఎంతోమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి ప్రాణాలనే నిలబెట్టే

వారి జీవితాల్లో నూతన ఉత్సహం నింపే మహత్తరమైన సేవా కార్యక్రమాలతో 12 ఏళ్ళుగా విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున సంకల్ప స్వచ్ఛంద సంస్థ అభినందించాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమానికి రావడం జరిగిందన్నారు. రక్తహీనతతో బాదపడుతున్న తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పోలీస్ కమిషనర్ పిలుపు నిచ్చారు. వ్యాధి రహిత సమాజంగా తీర్చి దిద్దేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం అవసరమైన సహాయ సహకారం అందించేందుకు ముందుంటుందని పోలీస్ కమిషనర్ అన్నారు.

కార్యక్రమంలో సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అనిత, డాక్టర్ డి. నారాయణముర్తి, డాక్టర్ సాయి భర్గవ్, డాక్టర్ రేణుక, డాక్టర్ అనుదీప్, డాక్టర్ దీప, మమత, ఉదయభాస్కర్, పావని, ప్రభాకర్, టెకులపల్లి యువత, రిచ్ ఫౌండేషన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరి వద్ద ఉండవలసిన గ్రంథం "జాతీయ అంతర్జాతీయ వేడుకలు"



లయన్ కెప్టెన్ డా: బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన "జాతీయ అంతర్జాతీయ వేడుకలు" గ్రంథం ప్రతి ఒక్క గ్రాంథాలయంలోనే కాకుండా అన్ని వర్గాలు, వయస్సులు కలిగిన ప్రతి ఒక్క వ్యక్తి వద్ద ఉండవలసిన అరుదైన పుస్తకమని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ఆచార్య సంకసాల మల్లేశ్ అన్నారు.

ఈ రోజు తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్లు సంయుక్తంగా కరీంనగర్లో నిర్వహించిన పుస్తకావిష్కరణ మహోత్సవంతో విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ దినోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలను తేదీల వారీగా పూర్తి వివరాలతో కూడిన 412 పేజీల బృహత్ గ్రంథాన్ని తీసుకురావడంలో రచయిత డా మధుసూదన్ రెడ్డి పడిన శ్రమ అనిర్వచనీయమని అంటూనే బహుముఖ ప్రజ్ఞ కనబర్చిన అరుదైన ఆదర్శవంతమైన వ్యక్తిగా నిలిచాడని అన్నారు.

ఈ గ్రంథం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, యువతకు ఎంతగానో ఉపకరిస్తుందని ప్రత్యేక అతిథి ఈద శంకర్ రెడ్డి, ఆడాయి పూర్వ అధ్యక్షులు అన్నారు.

ఈ పుస్తకాన్ని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని అన్నారు. ఇలాంటి పుస్తకాలను అన్ని గిరంథాలయాల్లో ఉంచే అవసరం ఉందన్నారు.

బోయినపల్లి వినోద్ కుమార్ ఆన్లైన్ సందేశం:

పుస్తకావిష్కరణలో పాల్గొన వలసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ ఢిల్లీ నుంచి ఆన్లైన్ వీడియో ద్వారా మాట్లాడుతూ పుస్తక రచనలు చేసే సాహితీవేత్తలు, కవులతో సమాజంలో మంచి జరుగుతుందని, అన్యాయాన్ని నిర్భయంగా వ్యక్తం చేయడాని వారు వెనకాడరని అన్నారు. డా: బుర్ర మధుసూదన్ రెడ్డి ఎంతో శ్రమకోర్చి ఈ ప్రజా ప్రయోజన గ్రంథం తీసుకువచ్చారని, ఈ పుస్తకాన్ని అన్ని విద్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని అన్నారు. ఇలాంటి రచనలు డా: రెడ్డి కలం నుంచి మరిన్ని రావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథి ఆల్ఫోర్స్ సంస్థల చైర్మన్ డా వి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ డా: మధుసూదన్ రెడ్డి మంచి రచయిత, కవిగా పేరుతెచ్చుకున్నారని, వారి నుండి మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. లీడ్ ఇండియా, తెలంగాణ తెలుగు భాషా సంఘం, సైక్లింగ్ అసోషియేషన్ లకు అధ్యక్షుడిగానే కాకుండా లయన్స్ అంతర్జాతీయ సంస్థలో ఎనలేని సేవలు చేస్తున్నారని అన్నారు.

లయన్ సింగమరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తక పరిచయకర్త నంది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ గ్రంథం హిందువులకు గీత, క్రిస్టియన్లకు బైబిల్, ముస్లింలకు ఖురాన్ వలె ఉపయోగపడుతుందని ప్రస్తుతించారు. సైన్స్, ఆర్ట్స్, కామర్స్, జనరల్ నాలెడ్జ్లకు సంబంధించిన అనేక అంశాలను సవివరంగా, సరళశైలితో వివరించడం జరిగిందన్నారు.

పుస్తకాన్ని కుటుంబ సభ్యులకు అంకితం చేయగా శ్రీమతి బుర్ర జలజా రెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డా. మనోహరాచారి, బొమ్మకంటా కిషన్, అనుముల దయాకర్లు పాల్గొనగా నగర పురప్రముఖులు అనేకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా: బుర్ర మధుసూదన్ రెడ్డి దంపతులను పలు సంఘాలు, మిత్రులు, బంధువులు ఘనంగా సన్మానించారు.

చరిత్రలో నేటినిజం



కం॥ చిలికిన రసబిందులవలె
చెరగని చరగని చిలవల సిరులగ సతమున్
మెరసెడి కథలను వ్రాసెడి
'తురగా జానకి'ని దలతు ఆశీశమల్లినై !

(ఆగష్టు 31 తురగా జానకీ రాణి పుట్టిన రోజు....)

-రాధశ్రీ
సెల్:9494481210



## ముళ్ళ పొదలు

అమ్మ గర్భంలో నుండి వెలుపడి
నిముషమైనా కాలేదు..
ఒంటికి అంటిన రక్తం మరకల తడి
ఇంకా ఆరనే లేదు....
కన్నులు తెరిచి జన్మనిచ్చిన తల్లిని
కన్నులారా చూడనే లేదు.
ప్రేమగా అమ్మ పాలు త్రాగనే లేదు
మృత్యువు ఒడిలోకి విసరి వేయబడ్డాను
ఎందుకో?.

ఎవ్వరిదీ పాపం అని
అడిగేది ఎవ్వరూ”
ఎందుకు ఇలా అని
నిలదీసేదే ఎవ్వరు”
ఆడపిల్ల అని చిన్నచూపా,
లేక!తెలిసీ తెలియని వయస్సులోనే
అమ్మ చేసిన తప్పుకు ఫలితమా?.

ఎందుకు ఇలా అని అడగలేను
ఎవ్వరీ ఘోరానికి మూలం అని ప్రశ్నించలేను

బిగపట్టిన పిడికిలి కూడా విచ్చుకోనేలేదు
అమ్మని గట్టిగా హత్తుకోవాలని ఉంది.
హత్తుకునేందుకు స్పర్శే తగలడం లేదు.
నాచుట్టూ కాళరాత్రి చీకటి.

చిన్నగా కన్నులు తెరుస్తున్నా.
నాది అనుకునే
ప్రపంచం నాయెదురుగా
నన్ను అంటుకున్న
రక్తం మరకల వాసనకేమో,
కుక్కల గుంపు ఆకలిగా
నన్ను చేరుతుంది.

మొదలైంది నా జీవన పోరాటం.
ముళ్ల పోదల మధ్యన..
నన్ను నేను కాపాడుకునేందుకు
ఇదే జీవన పోరటానికి ఆరంభం ..
మరుక్షణం ఏమౌనో....???..



**-రాము కోలా**
9849001201

## అద్దాల మేడలు.. పూరిగుడిసే ప్రేమలు

అద్దాల మేడలోవున్నను
బాధలు మెండుగనే ఉన్నాయి..?
పూరిగుడిసేలో వున్నను
ప్రేమలు నిండుగనే వున్నాయి..!!

ఆస్తి, పాస్తులున్ననేమియు
ఆనందం కరువాయేను..!

ధన,ధాన్యాలు లేకున్నా
మెండైన భ్రమలతోవుండెను..!!

బంగ్లాలలో వుంటూనే
ఖైదీలుగా మారుచుండెను..!
పాకలలో జీవిస్తూనే
పక్షుల్లా విహరిస్తుండెను..!!



**-పసుల.శంకర్**
9542181301

## పరిమళాల తల్లి

అదిగదిగో పూలచెట్టు
రెమ్మ రెమ్మ లో విరిసిన పూవై
చిరునవ్వుల కురిసిన వానై
మదిగదిలో పూచిన ప్రేమై
పరిమళాల తరగని గనియై
తాను మాత్రం మట్టిలో వేరై
తనకు తాను సమాధియై
కుటుంబాన్నీ, వంశ గౌరవాన్నీ
భుజస్కంధాలపై మోస్తూ
అనుక్షణమూ పాటుపడే
ఆ స్త్రీ మూర్తి
కాదా పూలచెట్టు



**- అమరజ్యోతి**
9182873598

## చేజారిన కల. ...

జీవితం గేలానికి
చిక్కుకున్న చేపలా
చేతికి దక్కకుండా
తృటిలో చేజారిన కల లా
ఒడ్డుకు చేరలేని
బలహీన అలలా
చెట్టుకు తట్టిన
గాలిపటం లా
గుంజకు కట్టిన
లేగదూడ లా
ముందుకూ వెనక్కూ
ఊగిసలాడుతుంది
కాళ్ళను బంధించిన
కాలం కలలను
చేజార్చుకున్న ఆకాశమై
మినుగు లను పట్టలనే
ఆరాటంలో భ్రమలో
సూర్యుడి ఉనికిని
కోల్పోయిన జీవితాలెన్నో.

**- డా. శ్రిష్టి శేషగిరి**
9290652632

# వాస్తవాలకు ప్రతిరూపమే కథలు






‘పు’న్నమి’ కలం పేరుతో సాహితీ సేవ చేస్తోన్న పున్న అంజయ్యగారు తెలుగు ఉపన్యాసకులు. పత్రికా సంపాదకులు. కథలు, నవలల జిల్లా సాహిత్య చరిత్రలు, కవితలు, నానీలు, మోనోగ్రాఫ్‌లు, విరివిగా రాస్తుంటారు. మహాకవి దాశరథి తొలి రచన ‘అగ్నిధార’ కావ్యాన్ని ప్రచురించిన ‘సాహితీ మేఖల’ అనేసంస్థ నిర్వాహకులు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, నల్లగొండ జిల్లా కేంద్రంగా ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రముఖ తెలంగాణా కవి కాళోజి నుండి ఎస్.గోపి వరకు ఎందరో ఉద్దండ సాహితీవేత్తలకు సన్మాన పురస్కారాలు అందజేశారు. జర్నలిస్టుగా వీరి సేవలు అవిచ్ఛిన్నంగా అయిదు దశాబ్దాలుగా (సుమారు) కొనసాగు తున్నది. సాహిత్య రంగంలో ‘అణచి వేత’ అనే అంటువ్యాధి ప్రభలన అనే నిజాన్ని నిర్భీతిగా ప్రకటించిన ధీశాలి. దళిత రచయిత ‘నల్లగొండ జిల్లా వెలుగు’ అయిన బోయ జంగయ్యతో కలిసి పలు సాహితీ కార్యక్రమాలు నిర్వహించిన ఘనత పున్న అంజయ్యగారికి దక్కింది.

1950లో అంబటి వూడి వెంకట రత్నం స్థాపించిన ‘సాహితీ మేఖల’ సంస్థ ‘కథావళి’ అనే కథల సంపుటిని వెలువరించారు. సాంప్రదాయ ప్రేమికులైన ‘పున్నమి’ అదే ఒరవడిలో ఇప్పుడు ‘కథావళి’గా తన కథా సంపుటిని పాఠకుల ముందుకు తీసుకువచ్చారు. సంపుటిలో 24 కథలున్నాయి. వీటిలో కొన్ని కథలు 1990 నుండి వ్రాసినవి కూడా చేర్చినందువల్ల పాఠకులకు ‘పున్నమి’ కథా స్వరూప స్వభావాలు అవగాహన చేసికునేందుకు వీలు కల్పించి అమరప్రేమ, భగ్నప్రేమ- పరిణామాలు, ఓటేసి ఎన్నుకున్న నాయకుడు కాటేయటం, చదువు ప్రాముఖ్యత, ఆకలి చావులు, ఊరించే ఉద్యోగాలు, ఇంటర్వ్యూల పేరిట జరిగే అక్రమాలు, చిన్ననాటి స్నేహితులు, పల్లెటూళ్ళలో మనసబులు వారి సంతానం చేసే అక్రమాలు, చేనేతన్నల కష్టాలు- ఒక్కటనేమిటి- పున్నమి ఎన్నుకున్న ‘కథా కాన్వాసు’ ప్రపంచమంత విస్తృతమై నది’. మధ్య తరగతి జీవితాలు ఎదుర్కొనే సమస్య లన్నింటికీ చిత్రిక పట్టి మలిచారు. వాస్తవాలకు ప్రతిరూపమైన వీరి కథల నిడివి 2.3 పేజీలకు మించవు. క్లుప్తత, సంక్షిప్తత, కథా వస్తువు, చిత్రణ-అన్నింటా ‘పొదుపు’ పాటిస్తూ పాఠకులను తన వెంట తీసుకెళ్ళ గలిగే ప్రయత్నంలో సఫలీకృతులయ్యారు.

ఎత్తుగడ, కథనంలో కవితాత్మకత కనబర్చుతారు. ‘ఊళ్ళోకి అచ్చర మొచ్చింది’ కథ ఇలా మొదలవుతుంది.

“నల్లగొండ జిల్లాలో అదొక పేట. ఆపేటలో కరువు వుంది. కనీరూ ఉంది కలతలున్నాయ్. బతుకు ఉంది. మెతుకు ఉంది. తిండి లేక ఏడ్చే వాళ్ళున్నారు. తిన్నదరక్క ఏడ్చే వాళ్ళూ ఉన్నారు”. గమ్యం అగమ్య గోచరకంగా ఉన్న ఆ ఊళ్ళోకి వెంట్రా మయ్య పంతులు రూపంలో అక్షరం వచ్చింది. “ఇన్నాళ్ళూ చదువెందుకు? అన్నపేట వాసులకు జ్ఞానోదయ మయ్యింది. ఇంత కంటే గొప్పగా ఏ కథకుడూ చెప్పగలడు? అది కూడా మూడు పేజీల నిడివిలో..!

పున్నమిగారు వేదనామయ జీవితా లనే కాదు, పాఠకుల పెదాల మీద మొలకనవ్వులూ పూయించ గలరు. ‘పాపం! సుబ్బారావ్’’ కోడిబాయె లచ్చమ్మదీ..’ లాంటి కథలు ఇందుకు తార్కాణం. 24 కథల్ని 75 పేజీల్లో ముగించి, ఏకబిగిన పూర్తి చేసిన పాఠకుడు ఈ సంపుటి రచయిత పున్న అంజయ్య గారికి అభినందించకుండా ఉండలేడు.

**ప్రతులకు:** పున్న అంజయ్య
ప్రధాన కార్యదర్శి ‘సాహితీ మేఖల’
ఇ.నెం. 6-2-954/2, రోడ్ నెం.2
కాకతీయ నగర్, మీర్‌బాగ్ కాలనీ
నల్లగొండ-508 001.
సెల్:9396610639



**- కూర చిదంబరం**
సెల్: 8639338675

పుస్తక సమీక్షలు

## గజల్

కన్నవారి ఉన్నతికోసం..తపించేవాడు నాన్నంటే
కలనైనా బిడ్డలకోసం..యోచించేవాడు నాన్నంటే

బడబాగ్ని తనలోవున్నా..చల్లని సంద్రంలా వుంటాడు
బాధలెన్నో తనలోవున్నా..దాచేసేవాడు నాన్నంటే

తనపిల్లల సౌఖ్యం కోసం..కొండనైనా పిండిచేస్తాడు
పిల్లల సంతోషమే స్వర్గమనీ..తలచేవాడు నాన్నంటే

నీ భవితకై నిరంతర తపన..నిను శిఖరానికి చేర్చేనిచ్చెన
నీకోసం తన ఆయువునైనా..ఇచ్చేవాడు నాన్నంటే

ఇంటికోసం సర్వస్వము..ధారపోసే త్యాగధనుడు
క్రొవ్వొత్తిలా దేవా వెలుగునిచ్చి..కరిగేవాడు నాన్నంటే



**- బూర దేవానందం**
8143589789.

## చినిగిన గొడుగు

వర్షంలో చినిగిన గొడుగు తోలు చెప్పులు
చేతబట్టి మోకాలు లోతు వరదలో
ఒకరి చెయ్యి మరొకరు పట్టుకొని
అతి కష్టంపై ఎదురీదుతూ అవ్వ తాత.

గాలి వానకు గూడు చెదిరి రోడ్డుపై
జీవితం ఏ దిక్కు లేక బతుకుదెరువుకు
ప్రయాణం ఎందాకో, ఎక్కడికో తెలియదు
కాలంతో పోరాటం మనుగడకై ఆరాటం.

అటూ ఇటూ చూస్తూ తలదాపుకై
వెతుకులాట ముఖంలో ఆందోళన
నీరసంగా అడుగులు ముందుకు వేస్తూ
భవిష్యత్తుకై ఆలోచిస్తూ కొత్త ఆశలతో.

కదులుతూ నాకు నువ్వు - నీకు నేను
కడదాక కష్టమైనా నష్టమైనా కాపాడుకుంటా

ఆనాటి పెళ్లి ప్రమాణాలు
యాదికొచ్చినాయి
వృద్ధాప్యంలోను
వారి బంధం ఆదర్శం

నేటి మానవ సమాజంలో
బంధాలు కరువై
నాది నీదని వేరు చేస్తూ
వీడిన బంధాలు ఎన్నో....



**-మిద్దె సురేష్**
9701209355

# తూరుపు సింధూరం...

మనిషి మనిషి సెల్లు కబురుల మిల్లు
తడిసి మోపెడు చిల్లు జేబులన్నీచిల్లు..

అంటూ చమత్కరిస్తూ.. చరవాణిని ఆత్మీయ నేస్తంగా ఆవిష్కరిస్తూ కవయిత్రి డాక్టర్ గడ్డం శ్యామలగారు తమ భావాలకు ‘తూరుపు సింధూరం’ కవితా సంపుటిలో చోటు కల్పించారు. ఈనాడు చరవాణికి లోకమంతా దాసోహమైన నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ శ్యామలగారు కరవాణి చరవాణి ఉదయాన మారాణి.. రమణీయ రాగమే కమనీయ కావ్యమేనంటూ రాసిన పంక్తులు బాగున్నాయి. కలలనే పలికించు కవితలే రాయించు.. నవరసాలొలికించు నాట్యమే చేయించు అంటూ వ్యాఖ్యానించారు. ప్రపంచమొక కుగ్రామం.. తెలిపెనుగా చరవాణి.. అంతర్జాలము సన్నిధి.. తెలుసుకున్న పున్నిధి అంటూ చరవాణి ప్రాశస్త్యాన్ని అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. చక్కని భావుకతతో చిక్కని గజల్ళు రాసిన అనుభవం ఉన్న డా॥ శ్యామలగారు. ‘వసంత సమీరాలు’, ‘హేమంత తుషారాలు’, పేర్లతో రెండు గజల్ సంపుటాలను వెలువరించారు. పేర్లతో రెండు గజల్ సంపుటానలు వెలువరించారు. అంతేగాక ‘సారంగి స్వరాలు’ గజల్ సంకలనాన్ని తమ సంపాదకత్వంలో ప్రకటించారు. వృత్తిపరంగా తెలుగు అధ్యాపకురాలిగా పని చేసిన ఆమె రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలుచుకుని తమ విశ్రాంత జీవితాన్ని కొనసాగిస్తు న్నారు. తమ తొలి కవితా సంపుటిగా వెలువరించిన ‘తూరుపు సింధూరం” లో 65 కవితలకు చోటు కల్పించారు. వస్తు ఎంపికలో వైవిధ్యముంది. అభివ్యక్తిలో నిడాంబరత ఉంది. శిల్పం విషయంలో అక్కడక్కడ చితురతను ప్రదర్శించారు. సరళత్వా నికి పెద్దపీట వేస్తూ.. అలతి అలతిపదాలతో అంద మైన భావా లను ప్రకటించిన కవితలున్నాయి. భావుకతా తిలకాన్ని అద్ది కవితాత్మ కంగా కొలువుదీరిన కవితలూ ఉన్నాయి. సాదాసీదాగా రూపుదిద్దుకున్న కవితలు కూడా అక్కడక్కడ తారసపడి నప్పటికీ కవయిత్రి డా॥శ్యామలగారు తమ అనుభవాన్ని రంగరించి రాసిన ఇందలి కవితలు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి.




రైతురాజు మాటేమిటో.. కూటికే మో పేద ఆయె.. కంట కునుకు లేకపాయె అంటూ ‘జాతి జీవగఱ్ఱ’ కవితలో అన్నదాత వ్యధలకు అద్దం పట్టారు. వేల్కొల్పాలి మనిషిలోని మానవత్వాన్ని మరో మనిషే అంటూ ‘నియమావళి’’ కవితను రాశారు. ప్రకృతికి వర్తించిన నియమావళి మనిషికెందుకు లేకుండా పోతుందని వాపోయారు.

ఇల్లిల్లూ తిరుగుతూ ఉత్తరాలు అందించే పోస్ట్‌మాన్‌ను ‘బంధువుకాని బంధువు।’గా ఓ కవిత ద్వారా తెలియజెప్పారు. అయితే ఈ కవిత ఓ మినీ వ్యాసంలా రూపాంతరం చెందకుండా జాగ్రత్త వడితే బాగుండేదన్న సంగతి శ్యామలగారికి తెలియంది కాదు.

కవయిత్రి గారు ‘నువ్వే నేను’ కవితలో రమణీయ భావాలను పొందుపరిచారు. చిరుగాలికీ.. విరిబాలకీ.. చినుకుకీ.. తడినేలకీ.. విరి తేనెకీ.. విరహానికీ వున్న సంబంధమే మనది అంటూ రాసిన పంక్తులు ఈ కవితలో చక్కగా ఒదిగిపోయాయి. జీవితపు పూల తోటలో వలపు వానలు కురియగానే.. చినుకు చిత్తడికి మొలకెత్తిన విత్తు గుర్తొచ్చింది.. అంటూ సిరిసిరి మువ్వ శబ్దంలా చినుకు చెప్పే ముచ్చట్లను ఈ కవితలో అందంగా.. కవితాత్మకంగా ఆవిష్కరించారు.

**రెప్పపాటు ఉప్పెనలను**
**కాగితాలపై కురిపించి కలత తీర్చేవి**

అక్షరాలే అంటూ “అక్షరాలు” కవితను తీర్చిదిద్దారు- అక్షరాలు ఆప్యాయంగా మాట్లాడుతా యనీ.. అల్లరిగా నవ్వుతాయనీ చెప్పడం బాగుంది. క్షయం కానిది అక్షరం.. అక్షరం మోక్ష సాధనం అని తేల్చి చెప్పారు.

చెలియ కన్నుల్లోని కమనీయ కాంతులను
చెలియ చెక్కిలిపైన నును సిగ్గు దొంతరలను
నీలాల కన్నుల్లోని మెరిసేటి మెరుపులను
వాలు కన్నుల్లోని ఒలికేటి సొబగులను

‘ఆనంద కిరణం’’ కవితలో ఆవిష్కరించారు.

ప్రకృతి సోయగాలను అక్షరాల్లో బంధిస్తూ మరో కవితను రూపుదిద్దారు. ఆకుపచ్చ చీర కట్టుకున్న భూదేవిని.. ముచ్చట్లాడే రంగు గులాబీలనను.. పసుపురంగు పువ్వులు కుట్టించుకుని అందాలను ఆరబోసే పూల మొక్కలను ఈ కవితలో ప్రస్తావించిన తీరు ప్రశంసనీయం గా ఉంది.

కనులకు గొడుగు.. కనులకు వెలుగు
కనులకు రక్షణ. కనులతో వీక్షణ

అంటూ “కంటి పాప” కవితను ఎత్తుకున్న తీరు బాగుంది.

హరితవనం మన బృందావనం
హరితహారం భరత మాతకు
భక్తితో సమర్పించే సమాహారం”

అంటూ “వృక్షమే జగతికి రక్ష” కవితను రాశారు.

ఓటంటే నోటు కాదు.. ఓటంటే మాట కాదు.. ఓటంటే పాట కాకూడదంటూ ‘ఓటు’ కవితను రూపుదిద్దారు. మదనాగ్నిని చిమ్మే చూపులతో..ప్రకృతినే నీ వశం చేసుకున్న సుందరీ.. నీ అందానికి పురుషుడు దాసోహమనక ఏం చేస్తాడు పాపం! అంటూ ‘అమ్మాయి’ కవితను రాశారు. తెల్ల కలువ రేకుల మీద.. భ్రమరం వాలినట్లు ఆ కన్నులు.. చందమామ నేలకు దిగివచ్చినట్టు ఆ మోము అంటూ ఈ కవితను చక్కగా ప్రారంభించారు.

“గోదావరి” కవిత బాల గేయాన్ని తలపించేలా రూపుదిద్దుకుంది.

“ప్రేమ” కవితలో ఇప్పుడిప్పుడు తెలుస్తున్నది.. మనసుతో బ్రతక నేర్పినవాడికి శరీరం బరువవుతున్నదని చెప్పడం బాగుంది.

తూరుపు వాకిలి తెరవగానే లేలేత వెలుగు కిరణాలు పలకరించాయంటూ ‘తూరుపు సింధూరం’ కవితను కవితాత్మ కంగా ప్రారంభించారు. ఉషోదయం వెలుగుల నుండి సాయం సంధ్యా వెలుగులలో లోకాన్ని అరుణ, శోభతో కాంతివంతం చేస్తానంటూ భానునికి కితాబునిచ్చారు. “నువ్వు”కవితలో భార్యా భర్తల బంధాన్ని గుర్తు చేస్తూ.. ఒక్కసారైనా నన్ను నన్నుగా ఉండనివ్వవా ప్లీజ్..

ఎంతకాలం ఉండమంటావ్
నాదంటూ నాకంటూ
ఏదీ లేకుండా..

అంటూ ఓ భార్యగా తమ అస్తిత్వాన్ని ప్రకటించే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం..

పెళ్ళినాట చేసుకున్న బాసలను.. పెళ్ళిపట్ల ఊసులను కన్నకలలను ఏకరువు పెడుతూ.. ‘అగ్నిసాక్షి’ కవితను తీర్చి దిద్దారు.

బిందెలో ఉంగరాన్ని తీయమన్నప్పుడు నీదే గెలుపు కావాలని నా చేయి కింద ఉంచాను. మూడు ముళ్ళు వేసేటప్పుడు దేవుడికి తప్ప తల వంచని నేను నీపై ఇష్టంతో తల వంచానని చెప్పడం వంటి అంశాలు కాబోయే భర్త పట్ల ఉన్న గౌరవాన్ని చాటే విధంగా కొలువుదీరాయి.

“ఆలుమగలు” శీర్షికతో రాసిన కవితలో గృహిణి ఎలా అణుకువగా ఉండాలో వివరించారు. ఆలుమగల గురించీ ప్రస్తావిస్తే బాగుండేది.

“ఊయల బాల్యం’ కవితలో బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ కవితను చదువుతున్నంత సేపూ మనమూ బాల్యంలోకి వెళ్లి పోతాం..

‘కేరింతలు’ కవితలో విభిన్నరకాలైన మనసు కేరింతలను వివరించారు.

కవిత్వానికి కులపు రంగులద్దిన కాలంలో కవిత్వపు కలాన్ని విను వీధులకు చేర్చిన మహనీయుడు అంటూ జాషువాను కొనియాడుతూ ‘‘గుర్రం జాషువా’’ కవితను రూపుదిద్దారు.

ఇలా.. ఈ గ్రంథంలోని కవితల్లో కవయిత్రి గడ్డం శ్యామలగారు ప్రకటించిన భావాలు ఆమెఉత్తమ సంస్కారాన్ని సూచించే విధంగా ఉన్నాయి. గజళ్ళు రాసే అనుభవమున్న కవయిత్రిగారు కొన్ని కవితల్లో చక్కని భావుకతను ప్రదర్శించే ప్రయత్నం చేశారు. మరికొన్ని కవితల్లో కవిత్వాంశ కొరవడినప్పటికీ.. సామాజిక బాధ్యతతో ఆమె ప్రతిపాదించిన అంశాలను ఆహ్వానించి తీరుతాం. ముమ్ముందు మరింత గాఢమైన కవిత్వాన్ని మనకు అందిస్తారని ఆశిద్దాం..

**ప్రతులకు:** డా॥ గడ్డం శ్యామల
ఫ్లాట్ నెం. 203,
మారుతిహైట్స్ అపార్ట్‌మెంట్,
న్యూ మారుతీనగర్,
చైతన్యపురం,
హైదరాబాద్-60.
సెల్: 9704175183



**- దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

## గజల్

చేతకాదని చెప్పకుండా అవసరానికి
సాయపడవోయ్..!!
చెప్పలేనంత కష్టమైతే సమయానికి
సాయపడవోయ్..!!

అహంకారం పెచ్చరిల్లిన
కుల మదాంధులు రెచ్చిపోతే..
తిరగబడరా సోదరా అని
బడుగువారికి సాయపడవోయ్ !!

డబ్బుకొద్దీ బతుకురీతులు లేనివాడికి
పస్తుపూటలు..
దేవుడిచ్చిన శక్తికొలదీ పేదవాడికి
సాయపడవోయ్ !!

అయినవాడని కానివాడని లేనెలేదిక
నిఘంటువులో..
కష్టకాలం వచ్చినప్పుడు ఎదుటివాడికి
సాయపడవోయ్..!!

యువతనడతను సంస్కరించే విద్యనేర్పే
గురువునీవై..
దారిచూపే దీపమల్లే సమాజానికి
సాయపడవోయ్ !!

**- పేరిశెట్టి బాబు**
సెల్: 9247170800

## పక్షుల సందడి

చిలకల్లారా ..చిలకల్లారా
కమ్మని కబుర్లు చెప్పండి
నెమళ్లల్లారా..నెమళ్లల్లారా
చక్కని నాట్యాలు వేయండి
కోయిల్లారా..కోయిల్లారా
తీయని పాటలు పాడండి
హంసల్లారా..హంసల్లారా
ముచ్చట నడకలు నేర్పండి
కోళ్లల్లారా..కోళ్లల్లారా
ప్రొద్దునే నిద్రను లేపండి
అందరు కలిసి హాయిగా
సందడి,సందడి చేయండి



**-కయ్యూరు బాలసుబ్రమణ్యం**
9441791239

# పక్షిలో విషమా..?

(కథ)



ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతున్న గండభేరుండం క్రింద అనేక పక్షులు సమావేశంలో ఉండటాన్ని గమనించింది. ఒకింత కాదు ఏకంగా ఆశ్చర్యం వేసింది. ఏమిటి? ఇన్ని పక్షులు ఒకచోట చేరాయి? ఒకవేళ ఎండ తీవ్రతకు తట్టుకోలేక చేరాయా? లేక ఏదయినా పక్షి జాతిలో ఎవరికైనా తట్టుకోలేని బాధ కలిగిందా? లేదా అన్యాయం జరిగిందా? ఒకవేళ నీళ్ళు ఏక ధాటిన ఒకచోట దొరుకుతున్నాయా? ఒకవేళ ఏదయినా జరిగితే తన దాకా ఎందుకు రాలేదు? అన్నింటికంటే పెద్ద పక్షిని నేను. ఏమాత్రం గౌరవం లేకుండా ఇలా ప్రవర్తిస్తే ఇక తన గొప్పేముంటుంది? లాంటి అనేక ప్రశ్నలు గండభేరుండం తలపులోకి రావడంతో తనలోని ప్రశాంతత పోయింది. ఎగరడంలో కూడా ఏకాగ్రత చెదిరి సమానంగా ఎగరాల్సింది పోయి క్రిందకు మీదకవుతోంది. వెంటనే తేరుకుని ‘అరె! నేనెందుకు కంగారు పడుతున్నాను. ఒక్కసారి క్రిందకు దిగి విషయం తెలుసుకుంటే సరిపోతుంది కదా? తినబోతూ రుచెందుకు అనుకుని ఏకంగా సమావేశం జరుగుతున్న చెట్టు పైన వాలింది.

ఇప్పుడు తనకు సమావేశం చక్కగా కనిపిస్తోంది. పైనుండి ఒక్కసారి గమనించింది. ఏవయినా మాటలు వినిపిస్తాయేమో అని రిక్కించి వినడానికి ప్రయత్నించింది. ఆశ్చర్యం ఏ పక్షీ మాట్లాడు కోవడం లేదు. మౌనంగా ఉన్నాయి. చుట్టుపక్కల ఏ జలాశయం లేదు. తినుబండా రాలు లేవు. ఇక ఎందుకు ఇలా కూర్చున్నాయి? అని తనలో తానే ప్రశ్న వేసుకుని, సమాధానం రాదని గ్రహించి ఏకంగా సమావేశం మధ్యలోకి చేరింది..

తమ మధ్యలోకి హఠాత్తుగా గండభేరుండం రావడం గమనించిన అన్ని పక్షులూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ముందుగా చిలుక తేరుకుని “నువ్వా! గండభేరుండ మామా! కంగారు పడ్డాము సుమా!” అంది నవ్వుతూ..

“కంగారెందుకు? అయినా ఇక్కడ సమావేశం ఏమిటి? ఎవరికోసం? ఎన్నడూ లేనిది ఏకంగా మన పక్షులన్నీ ఒకచోట చేరాయి? ఏదయినా విశేషమా? లేక విషాదమా? అడిగింది నాటక ఫక్కీలో గండభేరుండం.

ఆ మాటలు విన్న నెమలి ముందుకొచ్చి.. “ఒక రకంగా విశేషమే.. మరో రకంగా విషాదమే” అంది అటూ ఇటూ తిరుగుతూ..

“అదేంటి? ఇదేం సమాధానం? ఒకవైపు విశేషమంటూనే, మరొకవైపు విషాదం అంటున్నావు? కాస్త వివరంగా చెబుతావా? అంది ఆసక్తిని కనబరుస్తూ గండభేరుండం.

“నేనేం చెప్పగలను..? ఇదిగో వడ్రంగి, చెకుముకి చెబుతారు విను. వారయితే వివరంగా చెపుతారు. నేను ఆ చెట్టు నీడన సేద తీరాలి. అసలే ఊరికే అలసిపోతున్నాను. వృద్ధాప్యమేమో ఊరికే అలిసిపోతున్నాను.” అంటూ ఒక వారగా చెట్టుకు ఆనుకుని కూర్చుంది నెమలి రెక్కలల్లార్చుకుంటూ..

చెప్పిందే తడవుగా వడ్రంగి ముందుకొచ్చి ఒక్కసారి చిలక వైపుకు చూసాయి. చిలక విషయాన్ని అర్థం చేసుకుని మాట సాయానికి పక్కనే నిలబడింది.

విషయం ప్రారంభించే ముందు కాస్త తన గొంతును సరిచేసుకుని వివరించడం ప్రారంభించింది. “గండభేరుండ మామా! ఇన్నాళ్ళూ మనం ఎవరికీ హాని చేయలేదు. ఒకవేళ చేసినా నువ్వు చేస్తావేమో? అది కూడా ఎవరైనా చనిపోతే పీక్కుతినడం లాంటివి చేస్తావు. అదేం పాపం కాదుగా.. అలాంటిది.. ఇటీవల యు-ట్యూబ్‌లో ఒక విషయం హల్‌చల్ చేస్తోంది. ఏంటంటే మన జాతిలో ఒక విషపూరితమైన పక్షి వచ్చినట్లు. దాన్ని తాకగానే మనిషి విల విల తన్నుకుని చనిపోతాడని, అది కనబడితే దూరంగా పారిపోవాలని తెలియజేస్తున్నారు..”

“విషపూరితమైన పక్షా..? ఎక్కడుందని వెతకాలి? ఉన్నట్లుండి వస్తుందా? లేక చాలా చోట్ల ఉందా? లేక మన మధ్యనే నివసిస్తోందా? లాంటి విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేసారా? ఉంటే ఇన్నాళ్ళు ఎక్కడున్నాయి?” అంటూ ప్రశ్న మీద ప్రశ్నల్ని సంధించింది కంగారుగా గండభేరుండం.

ఆ ప్రశ్నలకు విసుగొచ్చిన పావురం “అబ్బ! నువ్వుండు మామా! అసలే మేము భయపడి ఛస్తున్నాం. మాకూ ఇంతకు ముందే వాట్స్‌ఆప్‌లో తెలిసింది. కాకి గూగుల్‌లోకి వెళ్ళి కనుక్కుంటే దానిపేరు పితోహి అని, అది స్వతహాగా విషపూరితమైన పక్షి కాదని, అది తినే ఆహారం మూలంగా అది విషపూరితంగా తయారవుతోందని తెలిసింది” అంది కంగారుగా.

“ఇంతకీ ఏమిటా ఆహారం?” ఆదుర్దాగా అడిగింది తీతూపిట్ట

“ఏం? తెలుసుకుని నువ్వూ తిందామనా?” అంది కోపంగా వడ్రంగి పిట్ట.

“నేనెందుకు తింటాను? నాకేమయినా విషపూరితంగా మారడం సరదానా? నేను మీ అందరితో కలిసి ఉండాలని కోరుకునే దాన్ని. ఒకవేళ విషపూరితమైతే ఒంటరిదాన్ని అయి పోనూ?” అంది తెలివిగా తీతూపిట్ట.

“సరేలే! అసలే నిన్ను చూస్తే ఏదో అశుభం జరుగుతుందని అందరూ భయపడతారు” అంది పిచ్చుక ముందుకొస్తూ

“సరే! సరే! ఇలా ఒకరినొకరు నిందించుకుంటూ పోతే అసలు విషయం మరుగున పడిపోతుంది. ముందు ముందు మనం చేయాల్సిన పనులు, ఆచరించాల్సిన విధులు అనేకం ఉన్నాయి. అసలే ఎండలు మండిపోతున్నాయి. నీడకు, నీటికి ఎలా

**“నేనెందుకు తింటాను? నాకేమయినా విషపూరితంగా మారడం సరదానా? నేను మీ అందరితో కలిసి ఉండాలని కోరుకునే దాన్ని. ఒకవేళ విషపూరితమైతే ఒంటరిదాన్ని అయి పోనూ?”**

అనే పోరాటంతో పాటు ఇప్పుడు వస్తున్న ఈ సమస్యల్ని అధిగమించే విధానాన్ని మనం వెదకాలి తప్ప ఒకరినొకరు తగ్గించుకుంటూ పోవడం వల్ల జాతిలో వైరం తప్ప ఒరిగేది ఏమీ లేదు” అంది కాస్త కంఠం పెంచుతూ నెమలి...

“ఆ! ఇంతకీ ఆ ‘పితూహి’ ఆహారం ఏమిటట? తెలిస్తే ఆ ఆహారం జోలికి మేమే కాదు, ఏ పక్షీ వెళ్ళదు.. ఏమంటావు?” అంది గండభేరుండం..

“నిజమే! ఆ వివరాలు కాకి బావకు క్షుణ్ణంగా తెలుసు. అంటూ కాకి బావా! అంటూ గట్టిగా పిలిచింది పావురం..

పిలుపు విన్న కాకి..ముందుకు వచ్చి కాస్త గొంతు సవరించుకుని “నేను గూగుల్‌లో వెతికితే తెలుసుకున్న వివరం ఏమిటంటే మన జాతుల్లో కూడా 5 రకాల విషపూరితమైన పక్షులు ఉన్నాయని. కాకుంటే కొన్ని ముక్కుతో పొడిస్తే విషం వస్తుందని, కొన్ని కాళ్ళ గోళ్ళద్వారా విషాన్ని విరజిమ్ముతాయని, కొన్ని తమ లాలా జలం ద్వారా విషాన్ని వెదజల్లుతాయని, కొన్ని నిలువెల్లా విషంతో నిండి వుంటాయని. అయితే అన్ని జాతులూ మన దేశంలో లేవు. ఉండవట కూడా. వివిధ రకాల దేశాల్లో జీవించడం మూలంగా మనకు ఏ విధమైన హానికరం కాదని కూడా తెలిపారు. కాకుంటే మన దేశంలో ఉండే ‘పితూహి’ అనే పక్షి మాత్రం మన దేశానికి చెందినదే. అది హిరోసిన్ అనే కీటకాలను తినడం ద్వారా తన శరీరాన్ని విషపూరితంగా చేసుకుంటోందట. ఇక్కడ మరొక వింత విషయం ఒకటుంది. అదేమిటంటే మానవులు ఆ పక్షుల్ని కూడా తినేస్తారట. చేతికి గ్లౌజ్‌లు వేసుకుని ఈకల్ని పీకేసి, మిగిలిన శరీరాన్ని నిప్పులపై కాల్చి తింటారట. దానివల్ల వారికి ఏవేవో రోగాలు కొని తెచ్చుకుంటారని సమాచారం” ముగించింది కాకి.

“అయితే ఇక్కడ విడ్డూరం కాకపోతే అంత విషపూరితమని తెలిసి మానవుడు ఇలా తినేయడం ఏమయినా బావుందా? మానవునికి తిండి తప్ప వేరే పని లేదు. ఉన్నవి ధ్వంసం చేయడం తప్ప వేరే వ్యాపకం ఉండదు. ఒకవైపు చెట్లు కొట్టేస్తారు. మరోవైపు జంతువుల్ని చంపి తినేస్తారు. పక్షులమైన మనల్ని చంపి తినేస్తారు. వారికి ఆనందం వచ్చినా, ఆవేదన వచ్చినా ఏదో ఒకదాన్ని చంపి వండుకుని ఆనందంగా తినేస్తారు” అంటూ ఒకింత విసుక్కుంది చిలక ముద్దుగా కన్నీటిని తుడుచుకుంటూ

“తినేయనీ తినేయనీ.. ఒకటి రెండుసార్లు అలాంటి విష పూరితం వారి శరీరంలోకి వెళ్ళి ప్రాణాల్ని పోగొట్టుకుంటే వారికే అర్థమవుతుంది. ఇక తినాలంటే ఏ పక్షిలో ఏ విషముందో అని తినలేక దెబ్బకి భయపడి పారిపోవాలి” అంది కోపంగా చెకుముకి.

“సరే ! సరే! వారికి తినడానికి అనేకం ఉన్నాయి. ఒకటి కాకుంటే మరొకటి. వారి తిండికేం కొదవ? కొదవ ఏదయినా ఉంటే అది మనకే. అసలు ఆ పక్షి ఎక్కడుంటుంది? రేపు దానివల్ల మనకే నష్టం రావచ్చు. అసలు ఎలా ఉంటుంది? ఆ విషయాలు తెలుసుకుంటే మనల్ని మనం కాపాడుకోవచ్చు.” అంది గోరింక

ఇంతలో “అమ్మా అమ్మా! అంటూ పరుగు పరుగున వచ్చిన పావురం పిల్లను చూసి ఒక్కసారిగా అన్నీ ఉలిక్కిపడ్డాయి.

“ఏమయిందమ్మా?” అంటూ అన్నీ ఒక్కచోట చేరాయి.

“నేను ఇందాక అల్లంత దూరంలో ఉన్న సరస్సులో నీటికోసం వెళ్ళి నీరు అందక కాస్త వొంగే సరికి నేను అందులో పడిపోయాను. అంతలో ఏనుగు వచ్చి తన తొండంతో నన్ను బయటపడేసింది. నేను దాదాపుగా ఇక చనిపోయాననే అనుకున్నానమ్మా! సమయానికి ఏనుగు రావడంతో ఇలా నీ ముందుకు వచ్చాను” అంది తల్లి పక్షిని హత్తుకుపోతూ భయంతో..

వెనుకగా వస్తున్న ఏనుగుకు అన్నీ నమస్కరించాయి. జంతువుల్లో చాలా తెలివయిన వారు, మంచి సహృదయులు మీరని మాకు తెలుసు. మీరు మా జాతిని రక్షించడం నిజంగా ధన్యవాదాలు’’ అంది నెమలి మర్యాద పూర్వకంగా నమస్కరిస్తూ ..

ఆ మాటలకు ఏనుగు నవ్వి “ఏం తెలివిలేమ్మా! ఎంత తెలివి ఉన్నా తాగడానికి నీరు, తినడానికి ఆహారం సంపాదించుకోలేక పోతున్నాము. మీరైనా,మేమైనా కాసింత నీటిని సంపాదించు కోవాలని అనిపిస్తోంది. లేకుంటే ఈ ఎండలకి మన జాతులు అంతమైపోవడం ఖాయం” అంది పేలవంగా నవ్వుతూ..

ఆ మాటలు విన్న మయూరం ముందుకు వచ్చి “నిజమే! కానీ ఇప్పుడు మాకో సమస్య వచ్చింది. అంటూ దాదాపుగా మిగిలిన పక్షులన్నీ తమలో కలుగుతున్న భయాన్ని వివరించారు గజరాజుకి..

ఏనుగు వాటి మాటలకి ఒకింత నవ్వి.. మీరు చాలా సున్నిత హృదయులు. ఎందుకంటే విషం ఎక్కడ లేదు? మాలో లేదా? మా జంతువుల్లో కనిపించగానే చంపి తినేసే మృగరాజు జాతిలో లేదా? అలాగని పారిపోతున్నామా? మనుషుల్ని సైతం మింగేసి జీర్ణించుకునే మనస్తత్వంతో పాములు ఎటూ ఉన్నాయి. మొసళ్ళు ఉన్నాయి. అన్నింటికంటే గొప్ప శత్రువు మానవుడు ఉన్నాడు. మరి ఎలా బతుకుతున్నాం? తప్పించుకుని అంతే! రేపు మీరు అంతే! వీలయినంతగా తప్పించుకుని తిరగాలి.. ప్రకృతిని సుందరంగా చూపించే పక్షులు ఎన్నో ఉన్నట్లే.. కిరాతకమైన పక్షులు ఉంటాయి. కనులకింపుగా కనిపించే జంతువులు ఉన్నట్లే నిత్యం సమస్య సృష్టించే జీవరాసులు ఉన్నాయి. అలాగే సాటి మనిషికి సాయం చేసే మనస్తత్వం కలిగిన మహనీయులున్నట్లే.. సాటి మనిషికి అన్యాయం చేసే పరమ కిరాతకులు ఉన్నారు. అంత మాత్రానా అందరూ లోపలే కూర్చుని జీవిస్తున్నారా? లేదే? అందరితోపాటు ఉండాల్సిందే! తప్పదు. కాకుంటే సమయానుకూలంగా..మనల్ని మనం కాపాడుకుంటూ బతకాల్సిందే” అంటూ మెల్లగా వెళ్ళి పోయింది ఏనుగు.

**ఏనుగు మాటలు విన్న పక్షులన్నీ నిజాన్ని గ్రహించి ఎవరి పనుల్లోకి అవి సంతృప్తిగా వెళ్ళిపోయాయి..**



**-శైలజామిత్ర**
9290900879

